కోల్‌కతా ఘటన హేయనీయం



కోల్‌కతా ఘటనతో అందరూ నివ్వెరపోయారు. డాక్టర్లను ప్రతిఒక్కరూ దైవంగా భావిస్తారు. అటువంటిది మహిళా డాక్టర్లపై హత్యాచారం ఘటన అత్యంత హేయనీయం. పని ప్రదేశాల్లో వైద్యులకు రక్షణ కల్పించాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. మరొకరికి ఇలా జరగకుండా కఠిన శిక్షలు అమలు చేయాలి. మహిళా డాక్టరు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి.

– డాక్టర్ శంకర్, కొల్లేటికోట పీహెచ్‌సీ, కైకలూరు మండలం

నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో మృగాల కన్నా దారుణంగా డ్రగ్స్ మత్తులో మహిళా ట్రెయినీ డాక్టర్‌ను పాశవికంగా అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. డాక్టర్ వృత్తిలో ఉన్న మహిళలకు రక్షణ కరువైంది. కోల్‌కతాలో జరిగిన సంఘటన సమాజం సిగ్గుపడే విధంగా ఉంది. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన శిక్షలు అమలు చేయాలి.

– డి.అశోక్‌కుమార్, ఎంపీపీ, పామర్రు

మహాలక్ష్మీ నమోస్తుతే..!

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



కూచిపూడిలో లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరి అమ్మవారు

ముదినేపల్లి రూరల్: నమస్తేస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే.. శంఖచక్రగదా హస్తే! మహాలక్ష్మీ నమోస్తుతే! అంటూ మహిళా భక్తులు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం నాల్గో శుక్రవారం సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారిని వేదికపై కొలువుదీర్చారు. సహాయ కమిషనర్ నేల సంధ్య ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలు ప్రారంభించారు. ఈ వ్రతాల్లో 260 మంది ముత్తైదువులు పూజలు చేశారు. పాల్గొన్న భక్తులకు అమ్మవారి పసుపు కుంకుమ, గాజులు, జాకెట్ ముక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అటవీశాఖ అధికారుల ఆదేశాల మేరకు మొక్కలు నాటారు.

లక్ష్మీదేవిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు

కూచిపూడి(మొవ్వ): శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం మొవ్వ మండలంలోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. కూచిపూడిలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు పెనుమూడి సతీష్‌కుమార్ శర్మ, పెనుమూడి పూర్ణ చంద్రశేఖర్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెదపూడి, గూడపాడు, మొవ్వ, మొవ్వపాలెం, కోసూరు, కాజ అయ్యంకి, చినముత్తేవి, నిడుమోలు గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చి పూజలందుకున్నారు.



ముదినేపల్లిలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్)ముదినేపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న సహాయ కమిషనర్, అర్చకులు



సామూహిక కుంకుమార్చన

కైకలూరు: శ్రావణ శుక్రవారం సందర్భంగా కైకలూరు మీసాల వెంకన్న ఆలయంలో శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో ఉదయం, సాయంత్రం భక్తులు రద్దీ కనిపించింది. దాతలు చాపరాల భానుభాస్కర్, వరదా వెంకట శివరామకృష్ణ కిషోర్, తోట పెద్దిరాజు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు కావల్సిన అన్ని ఏర్పాట్లను ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు

జమీదగ్గుమిల్లి(పామర్రు): మండలంలోని జమీదగ్గుమిల్లిలోని శ్రీ గంగానమ్మ పోతురాజుల జాతరను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నారు. తొలిరోజు శుక్రవారం ఉదయం నుంచి మహాలక్ష్మికి పూతలు పెట్టే కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి జాతరలో భాగంగా గ్రామ పొలిమేరల్లో ఆన కట్టడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.చంద్రశేఖర్‌రావు దంపతులు, సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు మీసాల వెంకన్న ఆలయంలో సామూహిక పూజలు



కైకలూరు శ్యామలాంబ ఆలయంలో భక్తుల రద్దీ



జమీదగ్గుమిల్లిలో మహాలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు

విద్యాబోధనలో మిద్దే అందరికీ ఆదర్శం



మిద్దే శ్రీనివాసరావు సత్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు

గుడివాడరూరల్: విద్యా బోధనలో ఉపాధ్యాయులు మిద్దే శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకోవాలని గుడివాడ డివిజన్‌లోని మండల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. స్థానిక ఎస్పీఎస్ మున్సిపల్ పాఠశాల్లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన మిద్దే శ్రీనివాసరావు పాఠశాల్లో విద్యాశాఖ అధికారుల సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సులభతరంగా విద్యను బోధించడంలో శ్రీనివాసరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుడివాడ, నందివాడ, పెదపారుపూడి, గుడ్లవల్లేరు విద్యాశాఖ అధికారులు ఇందుపల్లి విజయ్, భూక్యా బాలాజీ, గూడపాటి డేవిడ్ రాజు, సురేష్‌కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

గుడివాడరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ యూటీఎఫ్, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావుకు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం



కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న సర్పంచ్ రత్నకుమారి

కైకలూరు: 'హరితాంధ్ర కోసం ప్రతిఒక్కరం మొక్కలు నాటుదాం' అని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కేవీ.రామలింగాచార్యులు పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా రేంజర్ కార్యాలయం, ఆటపాక పక్షుల కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వద్ద సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ డెప్యూటీ రేంజర్ జీవీవీ.జయప్రకాష్, సెక్షన్ ఆఫీసర్లు కరీం, సత్యనారాయణ, బీట్ ఆఫీసర్లు వెంకన్న, రాజ్‌కుమార్, నరసింహ, రాజేష్ పాల్గొన్నారు. కైకలూరు అగ్నిమాపక కేంద్రం వద్ద ఫైర్ ఆఫీసర్ క్రాంతి కుమార్ మొక్కను నాటారు. సిబ్బంది అంజిబాబు, రాం భాస్కర్, రాంబాబు, సూర్యం పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మొక్కను నాటారు. ఈఓపీఆర్డీ రవిశంకర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో..

కైకలూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి మొక్కను నాటారు. కార్యక్రమంలో ఎండీ గాలిబ్ బాబు, గుడిపాటి జగన్నాథ్, పీవీ.శ్యామల రావు, సచివాలయ సిబ్బంది రవిశంకర్, పవన్, చైతన్య పాల్గొన్నారు.

గ్రామాల్లో వన మహోత్సవాలు

మండవల్లి: కానుకొల్లు, అయ్యవారిరుద్రవరం గ్రామాల్లో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కానుకొల్లులో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్వై మాధవకుమార్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, సర్పంచ్ ఎన్.థామస్ మాట్లాడుతూ మానవ ప్రగతికి చెట్లే మూలాధారమన్నారు. రూ.30వేలు విలువగల పెద్ద మొక్కలను పాఠశాల ఆవరణలో నాటారు. డిప్యూటీ కలెక్టర్ బాబ్జి కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కను నాటారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, ఎంఈఓ రామారావు పాల్గొన్నారు. అయ్యవారిరుద్రవరం ఎంపీపీ స్కూల్లో మొక్కలు నాటారు. ఉప సర్పంచ్ నాగరాజు, హెచ్‌ఎం పిచ్చియ్య పాల్గొన్నారు.

యలమర్రులో..

యలమర్రు(పెదపారుపూడి): భవిష్యత్ తరాల మనుగడకు ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలని ఎంపీడీఓ సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని యలమర్రులో శుక్రవారం వనం–మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ రంగారావు, సర్పంచ్ కొల్లూరి అనూష, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీఓ పీ మల్లీశ్వరీ శుక్రవారం మొక్కలు నాటారు. డీఎల్పీఓ పూర్ణచంద్రశేఖర్, తహసీల్దార్ సుభానీ, ఎంఈఓ కొల్లి నరేష్, ఈఓపీఆర్డీ దూలం లక్ష్మీనారా యణ, ఏఓ రమణబాబు, వ్యవసాయాధికారి వేణు మాధవ్, టీడీపీ నాయకుడు వీరమల్లు నరసింహారావు, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, గణేష్, దివి సతీష్ పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ పార్క్‌లో మున్సిపల్ కమిషనర్ జి.బాలమురళీకృష్ణ, టీడీపీ నాయకుడు కామేపల్లి తులసీలతో కలసి రావి శుక్రవారం మొక్కలు నాటారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ ఎంఈ విజయదుర్గ, డీఈ ప్రవీణ్, ఏఈ తేజశ్విని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. తొలుతగా వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు హెచ్‌ఎం పీవీ ప్రసాద్ అందజేశారు. విద్యాకమిటీ చైర్మన్ కృష్ణవేణి, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, సత్తిబాబు పాల్గొన్నారు. అప్పాపురంలో సర్పంచ్ భోగేశ్వరరావు ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ



గుడివాడలో ర్యాలీ చేస్తున్న డ్వాక్రా మహిళలు, అంకిత స్వచ్ఛంద సభ్యులు

గుడివాడరూరల్: మహమ్మారిగా ఉన్న ఎయిడ్స్‌ను అందరూ తరిమికొట్టాలని అంకిత స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ టి.అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అంకిత సంస్థ సభ్యులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారి చాలా ప్రమాదకరమైందన్నారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, సురక్షితం కాని సంబంధాలు, సిరంజిల వలన వ్యాపిస్తుందన్నారు. ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండి వ్యాధిని దూరం చేసేలా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం జి.లావణ్య, పీడీ జి.బేబిసరోజిని, కార్యకర్తలు లక్ష్మీ, సరోజ, పార్వతి, లలిత, నాగమారుతి, సీహెచ్ క్రాంతి, ఎండీ రాజమ్మ, డి.జ్యోతి, టి.విజయదుర్గ పాల్గొన్నారు.

సవరణ

ది. 21-7-2024న శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిచే ఇవ్వబడిన ప్రకటనలో విజయవాడ -1 బ్రాంచి బదులుగా కైకలూరు బ్రాంచి అని చదువుకొనగలరు.
పంత్రాజు రాంబాబు, న్యాయవాది, మెయిన్‌రోడ్, ఉయ్యూరు

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల చొరవతో సైకిల్ స్టాండ్ ఏర్పాటు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆ పాఠశాల్లో సైకిల్ స్టాండ్ నిర్మాణానికి ముందుకొచ్చారు. ఈ పాఠశాల్లో 1984–1985 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సహకారంతో రూ.1.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసే సైకిల్ స్టాండ్ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



పామర్రు: స్థానిక చాట్లవానిపురంలోని ఎంపీపీ పాఠశాల్లోని చిన్నారులకు దాతలు శుక్రవారం విద్యాసామగ్రిని అందజేశారు. స్థానిక నూతన దంపతులైన చాట్ల రవి, షామినీలు విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.రవీంద్రప్రసాద్, ఉపాధ్యాయులు టీ శ్రీ ఆండాళ్లు, సీహెచ్ విజయలక్ష్మి, పంచాయతీ మాజీ సభ్యులు చాట్ల శ్రీనివాసరావు, స్థానికులు చాట్ల రాంబాబు, సౌదామిని, దునుకు రఘునాథ రావు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ



అయ్యంకి(మొవ్వ): విత్తనాల్లో కేళీలను(బెరుకులు) గుర్తించి తీసివేయాలని మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కే శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో రైతులకు విత్తనోత్పత్తి, ఖరీఫ్ 2024 పై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ విచక్షణా రహితంగా ఎరువులను, పురుగుమందులను వాడకూడదన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ బి.పద్మజ, ఉయ్యూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డి.సుధారాణి, మొవ్వ ఏఓ కే శివప్రసాద్, వీఏఏ రాజేష్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో వైకల్యానికి చెక్



పామర్రు: ఫిజియోథెరపీతో అంగవైకల్యానికి చెక్ పెట్టవచ్చని పామర్రు ఎంఈఓ–2 పద్మవాణి అన్నారు. స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలోని భవిత సెంటర్‌లో శుక్రవారం ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఫిజియోథెరపీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిజియోథెరపీ వైద్యులు జె.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఈఆర్టీలు కె.మరియన్న, ఎం.కోటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

కైకలూరు: కైకలూరు కోర్టు ఆవరణలో సెప్టెంబరు 14న ఉదయం 10.30 గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ.లక్ష్మి పేర్కొన్నారు. క్షణికావేశంలో చేసే చిన్న తప్పులకు కేసులతో కోర్టులు చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారం పొందాలని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వేడుకలు



నిమ్మకూరు(పామర్రు): సినీ చరిత్రలో 50 ఏళ్లు సినీ రంగంలో కళామతల్లికి సేవలను అందించిన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భవిష్యత్‌లో మరింతగా అభివృద్ధి పొందాలని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా ఆకాంక్షించారు. మండలంలో ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో బాలకృష్ణ 50 ఏళ్ల సినీ జీవితాన్ని పూర్తి చేసిన సందర్భంగా ఎన్టీఆర్ దంపతులు విగ్రహాల వద్ద గోల్డెన్ జూబ్లీ విజయయాత్రను ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించి, అనంతరం కేక్‌ను కట్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కె.ప్రవీణ్ చంద్ర పాల్గొన్నారు.

సింగిల్ విండో విధానంలో చవితి మండపాలకు అనుమతి

కైకలూరు: వినాయక చవితి ఉత్సవాల్లో మండపాలకు ఈ ఏడాది సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తామని కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ శుక్రవారం తెలిపారు. అనుమతుల కోసం పోలీసుశాఖ ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కేవీఎస్.కిషోర్ ఆదేశాల మేరకు ఈ పోర్టల్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ముందుగా నిర్వాహకులు 79950 95800 వాట్సాప్ నంబరుకు హాయ్ అని మెసేజ్ పంపాలన్నారు. అదే సెల్‌కు మెసేజ్ రూపంలో గణేసోత్సవ్ పేరుతో లింక్ వస్తుందన్నారు. దానిని క్లిక్ చేస్తే కొత్త అప్లికేషన్ కనిపిస్తుందన్నారు. ముందుగా మీ సెల్ నంబరును ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుందన్నారు. దానిని సబ్మిట్ చేసిన తర్వాత వివరాలను అడుగుతుందన్నారు. రెడ్ నక్షత్రాలు కలిగిన వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో మండపం ఏర్పాటు చేయాలనుకున్న ప్రాంతం, పేరు, ఈ–మెయిల్, అడ్రస్, ఉత్సవ కమిటీ సభ్యులు పేర్లు తదితర వివరాలను నమోదు చేసి అప్లికేషన్‌ను సబ్మిట్ చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి సెల్ నంబరులోనే క్యూ ఆర్ కోడ్ కలిగిన ఎన్‌ఓసీని పంపుతారని పేర్కొన్నారు.

రేపటి నుంచి శ్యామలాంబ మాలదీక్ష

కైకలూరు: స్థానిక ప్రజల ఆరాధ్య దైవం శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో శ్యామలా మాలదీక్షలు సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ శుక్రవారం తెలిపారు. దీక్ష మొదటిసారి స్వీకరించే భక్తులకు దేవస్థానం తరఫున అమ్మవారి రాగి ప్రతిమను ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. నీలివర్ణం దుస్తులు, స్ఫటికమాలను మాలధారులు ధరించాలని తెలిపారు. అర్ధ మండల దీక్షాపరులు సెప్టెంబరు 20, నవదిన దీక్షాధారులు సెప్టెంబరు 30వ తేదీ లోపు దేవస్థాన కార్యాలయంలో పేరు, గోత్రం, చిరునామాను నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98668 99304 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైతులకు పుష్కలంగా ఎరువులు

గుడివాడరూరల్: రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం పుష్కలంగా ఎరువులను అందిస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.పద్మావతి పేర్కొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్దకు మార్క్‌ఫెడ్ ద్వారా వచ్చిన ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా 141 పీఏసీఎస్‌లలో యూరియా 9221 ఎంటీఎస్, డీఏపీ 1819 ఎంటీఎస్‌ను సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం మురళీకృష్ణ, వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, మండల వ్యవసాయశాఖ అధికారి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పామర్రు: మండలంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. పామర్రు సీఐ సుభాకర్‌కు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని ఎలకుర్రు గ్రామ శ్మశాన వాటిక వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురుని పోలీసులు గుర్తించారు. వీరి వద్ద ఉన్న రూ.6,300ను స్వాధీనం చేసుకున్నారు. మీడియేటర్ రిపోర్టు రాసి, కేసు నమోదు చేయమని ఎస్ఐ అవినాష్‌కు సీఐ అప్పగించారు.

విద్యార్థులకు వ్యాక్సిన్



విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ అజయ్‌కుమార్

అడ్డాడ(పామర్రు): స్థానిక అరవింద హైస్కూల్ విద్యార్థులకు సురక్ష పబ్లిక్ హెల్త్ కౌన్సిల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా టైఫాయిడ్ వ్యాక్సిన్‌ను శుక్రవారం అందజేశారు. ప్రముఖ వైద్యులు పీ అజయ్‌కుమార్ విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. అనంతరం ఆయన టైఫాయిడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎరువుల దుకాణాల తనిఖీ

మండవల్లి: లింగాలలో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఎరువుల వివరాలు, నిల్వ, రేటు వివరాలను స్టాకు బోర్డులో ప్రదర్శించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లింగవరంలో సమస్యలు పరిష్కరించండి

గుడివాడరూరల్: లింగవరం గ్రామంలో అపరిష్కృత సమస్యలను అధికారులు పరిష్కరించాలని సామాజిక కార్యకర్త, గ్రామస్తుడు రవికుమార్ ఎంపీడీఓ అనగాని వెంకటరమణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గ్రామంలో కనీస మౌలిక వసతులు లేకుండా పోయాయన్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయిందన్నారు. మురుగు నీరు నిల్వ ఉందని తెలిపారు. సైడ్ కాల్వలు లేక మురుగు నీరు రోడ్లపై చేరుతోందన్నారు. మంచినీటిని క్లోరినేషన్ చేయకుండా పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. గ్రామ కార్యదర్శి ఎప్పుడు వచ్చి ఎప్పుడు వెళ్లిపోతున్నారో తెలియడం లేదని, సమస్యలు చెప్పుకుందామంటే అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. గ్రామంలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీఓను కోరారు.

డీఆర్‌బీ ప్రసాద్‌ను సత్కరించడం అభినందనీయం

గుడివాడరూరల్: తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో పలువురు సాహితీ వేత్తలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సత్కరించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. గుడివాడ తెలుగుభాషా వికాస సమితి సమన్వయకర్త, భారతీ సమితి అధ్యక్షుడు డీఆర్‌బీ ప్రసాద్‌ను సత్కరించడంతో పట్టణంలోని సాహితీవేత్తలు, ప్రముఖులు ఆయన్ను శుక్రవారం అభినందించారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

గుడివాడరూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడిగడప, కాజాస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటో తేదీన పామర్రు మండలం పసుమర్రులో జరిగే ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు యడ్లపల్లి శ్రీహర్ష కోరారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం ఎదురుగా ఉన్న వివాన్ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్‌క్లబ్ తాడిగడప అధ్యక్షుడు కేవీఎస్ చౌదరి, కాజా చక్రధర్‌బాబు, కొల్లి అనిల్ పాల్గొన్నారు.

వీఆర్వో కార్యాలయం ప్రారంభం

యలమర్రు(పెదపారుపూడి): వీఆర్వోలు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ రంగారావు అన్నారు. మండలంలోని యలమర్రులో గ్రామ వీఆర్వో కార్యాలయం, డ్వాక్రా గ్రూపుల సభ్యుల కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ సీతామహాలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ చౌదరి, నాయకుడు సత్యనారయణ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

కైకలూరు: లయన్స్ క్లబ్ ఆకివీడు ఆదర్శ ద్వారా పల్లెవాడ గ్రామానికి చెందిన రమేష్, శ్రీనివాసరావు ఇదే గ్రామంలో యూపీ స్కూల్‌కు రూ.18వేల విలువ చేసే ప్రింటర్‌ను వితరణగా శుక్రవారం అందజేశారు. దాతలకు పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, సహచర ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేశ్వరి, కార్యదర్శి జ్యోతి రెడ్డి, కోశాధికారి మణి, రీజియన్ అధ్యక్షుడు జి.కృష్ణమూర్తి, కార్యదర్శి ఎం.రమేష్, సర్పంచ్ దుట్టా మణి పాల్గొన్నారు.

కొల్లాబత్తుల సేవలు ప్రశంసనీయం

పామర్రు: ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కొల్లాబత్తుల సల్మాన్‌రాజును పామర్రు టౌన్ పాస్టర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ల కోసం సల్మాన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆయన సేవలను గుర్తించి ఉత్తమ సేవా రత్న, ఉత్తమ పాస్టర్‌గా అవార్డులను అందిస్తున్నామన్నారు. ఫెడరేషన్ సభ్యులు శ్యాంబాబు, సత్యకుమార్, విజయరాజ్, ఇమ్మానియేలు, ఆదాము పాల్గొన్నారు.

ఇసుక అక్రమరవాణాదారుడిపై కేసు

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలం భద్రిరాజుపాలెం కరకట్టమీద అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న పమిడిముక్కల మండలం వీరంకిలాకుకు చెందిన పాగోలు ప్రదీప్‌రాజును ఎస్ఐ అర్జునరాజు తన సిబ్బందితో కలిసి శుక్రవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఇసుకను తరలించేందుకు కావాల్సిన బిల్లుల గురించి ప్రశ్నిస్తే బిల్లులను చూపించకపోవడం వలన అతడ్ని అరెస్టు చేసి, ఇసుక లోడ్‌తో ఉన్న లారీని సీజ్ చేశారు. లారీ ఓనర్ అయిన కొడాలి గ్రామానికి చెందిన బండి యశ్వంత్, ఇసుక లోడ్ చేసిన కాంట్రాక్టర్ రమణయ్య పరారీలో ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.